కథా నిలయం
3656
శ్రీకాకుళం

# శానమ్మ

త్యాగరాజ కీర్తన వింటూ, మరునాటి పొద్దుటి కూరకై గోరుచిక్కుడు యీనెలు నెమ్మదిగాతీస్తూ, కాయలు తుంపుతున్నాను. ముందుగదిలో ఆయన ఏదో రాసుకుంటున్నారు. చీకటిపడితే మా వీధిలో బిచ్చగాళ్ళ కేకలకి విధీ విరామం వుండదు. ఆయనకి అడుక్కునే వాళ్ళంటే చికాకు. వాళ్ళొంచి పనిచెయ్యక...అని చదువుతారు.

"అమ్మా, అమ్మా" అని మా గుమ్మందగ్గిర ఆడకంఠం వినబడింది.

"ఫోఫో" అని కసిరారు ఆయన.

"కొంచెం పచ్చితణ్ణి సామీ" అని మళ్ళీ దీనంగా అడిగింది ఆడకంఠం.

"తణ్ణీలేదు, గిణ్ణీలేదు ఫో. ఒక్కక్షణం రాసుకోనివ్వరు గదా! వెధవగోలా వీళ్ళూనూ—ఫోఫో" అని గద్దిస్తున్నా రాయన.

నేను లేచి వీధి గుమ్మందగ్గిరకి వెళ్ళాను, సన్నగా బక్క పలచగా పొట్టిగా వుందొక ఆడమనిషి. చిన్న కుండపట్టి నీళ్ళడిగింది.

మొదట్లో నేను గుర్తుపట్టలేదు గాని కుండలోకి నీళ్ళు పోస్తుంటే, వీధిదీపం వెలుగులో ఆ మనిషి యెవరో గుర్తు పట్టాను.

నీళ్ళుపోసి యింట్లోకి వస్తూంటే "వేళాపాళాలేదు వెధవ లకి. నేను పొమ్మంటే - నువ్వు నీళ్ళుపోస్తివి యింకచూడు. యివ్వాళ్ళ మంచినీళ్లూ, రేపు గంజినీళ్ళు పొయ్యమంటుంది. ఎల్లుండి అన్నం పెట్టమంటుంది" అంటూ విసుక్కున్నారువారు.

"రెండు గంగాళాల నీళ్ళు, పొద్దుటే పనిమనిషి పార బోస్తుంది. అందులోని రెండుచెంబులుపోస్తే ఏం పోయిందండీ" అన్నాను.

"అవున్లే పొయ్యి - పుణ్యంవస్తుంది."

"పుణ్యమో పాపమో - అదంతా నాకు తెలియదు. మనకు ఎక్కువగా ఉన్నాయి. వాళ్ళకి తాగేందుకు కావాలి. ఆ నీళ్ళేగా నేను పోసింది" అంటున్న నా మాటలు వినిపించు కోకుండానే ఆయన తన కాగితాల ధ్యాసలో పడిపోయారు.

నాలుగురోజుల క్రితం, సాయంత్రంవేళ ఆయనకోసం యెదురుచూస్తూ వీధిగుమ్మంలో నుంచుని ఉండగా మా ఎదు రింటి పేవ్‌మెంటుమీద ఓ చిన్న సంసారం కనపడింది. అసలు యీ పేవ్‌మెంటు డ్వెల్లర్సు అంటే అందరికీ చికాగ్గానే ఉంటుంది - నాకూ అంతే. ఏడేళ్ళ పిల్లాడూ, మొగుడూ పెళ్ళాం; రెండు సీనారేకు డబ్బాలూ, రెండుకుండలూ, చింకి చాప, ఒకచేట, నాలుగు చిటుకులు - ఈ సంసారం ఎదుటి పేవ్‌మెంటుమీద కనపడేవేళకి నాకు కాస్త బావుండలేదు. తలుపు తీసినప్పుడల్లా-ఈ దరిద్రపు మొహాల దర్శనంకాబోలు- అనుకున్నాను. కాని వాళ్ళని పొమ్మనటం ఎలా ? మా ఇంటి వైపునైతే పొమ్మని చెబుదును. మరి ఎదురింటివైపున వుండిరి. అయినా నాకెందుకు ? - అని వూరుకున్నాను.

మళ్లీ ఆ సంగతి ఎందుచేతనో మర్చిపోయాను. రాత్రి వేళ కుండలో నీళ్ళుపోస్తూ ఆ ఆడమనిషిని పలానా అని గుర్తు పట్టగలిగాను - అంతే.

o o o

పూర్వకాలం స్త్రీలు నిద్దరపక్కమీదనుంచి లేస్తూ, దేవుణ్ణి ముందు తలుచుకునేవారట. కొందరు ప్రతివ్రతలేమో భర్త పాదపద్మాలని కళ్ళకద్దుకునే వారట. నాకాలపు స్త్రీలు ఉన్నారు చూశారూ - వారు మొట్టమొదట తలచుకునేది దేవుణ్ణికాదు, భర్తనీకాదు; పనిమనిషిని. పాలవాడు రాకపోతే డబ్బాపాలతో కాఫీ కాచుకోవచ్చు - పనిమనిషి రాకపోతే ఎలా? ప్రపంచమే కుంగిపోతుంది.

బాగా తెల్లగా తెల్లారింది. రాత్రిపడేసిన అంట్లగిన్నెల్ని కాకులు దొర్లిస్తున్నాయి. వీధిలోకివెళ్ళి రెండుసార్లుచూశాను. పనిమనిషి జాడలేదు. బిక్కగా చూస్తున్న నన్ను ఎదుట పేవ్ మెంటు సంసారంలోని ఆడమనిషి పలకరించింది.

"అమ్మగారూ పనిమనిషి రాలేదా? వీధివాకిట్లో నేను ముగ్గు వేస్తానులెండి" అన్నది.

ఆ మనిషి ఆపూట వీధివాకిలి తుడిచి అంట గిన్నెలు తోమిపెట్టింది. ఒక బేడడబ్బులు యిచ్చి, రాత్రి మిగిలిన అన్నం పెట్టాను.

వారులేచాక బిచ్చగాళ్ళలోనూ, పేవ్ మెంటు డ్వెల్లర్స్ లోనూ ఎంత మంచివారుంటారో చెబుదామని కూచున్నాను. కాని ఆయన ఆలస్యంగా లేవడంవల్ల ఆ మంచి ముక్క ఆయనకి చెప్పడమే పడలేదు.

సాయంత్రం కూడా ఆ ఆడమనిషి వచ్చి గదులన్నీ వూడిచి, వీధివాకిలి తుడిచి, ముగ్గేసి అంటగిన్నెలూ గ్లాసులూ తోమి యిచ్చింది. ఈలోగా మా యిద్దరిమధ్య బోలెడంత సంభాషణ జరిగింది.

మనవూళ్లో అయితే పెరళ్ళు పెద్దవి వుంటాయి. పని వాళ్ళు ఒక మూలగా అంట్లు తోముతూంటారు. మరి మద్రాసులాంటి పట్టణాల్లో వంటింటి నానుకుని స్నానాలగది, దాని నానుకునే పెరటిదొడ్డి. కొన్ని యిళ్ళలో ఆ మాత్రం ఖాళీస్థలం కూడా వుండదు. అంటగిన్నెలు తోమేస్థలం పడక గదికో, నడవకో ఎదురుగ్గా కూడా వుంటుంది. పనిచేసేవాళ్ళు మనకళ్ళముందే అంతసేపూ కనపడుతూంటారు.

ఎదురుగ్గా మనిషి అలా కొంతసేపు కనపడితే, మాట్లాడించకండా వుండడం నాకు సాధ్యంకాని పని. ఏదో ఒకటి అడుగుతూనే వుంటాను; వాళ్లు వచ్చీరాని తెలుగులో సమాధానం చెబుతూనే వుంటారు.

"నీ పేరేమిటి?"

"శానమ్మ అండీ" అంది.

"మద్రాసు కొత్తగా వచ్చారా?"

"లేదమ్మగారూ! మా అమ్మ కాలంలోనే ఒంగోలు నుంచి వచ్చాం. మా చిన్నాన్న తిరువళ్ళూరులో వున్నాడు. అక్కడ ఫ్యాక్టరీలో పని" అంది శానమ్మ.

"మరి—నీ భర్త పనిచెయ్యడంలేదా?"

"సీనా రేకు బుడ్డీ, లైట్లుచేసే కొట్లో పనిచేసేవాడు. నాలుగు మాసాలుగా పనిపోయింది. వుట్టినే వున్నాడు."

"ఇంకో పని చూసుకోలేక పోయాడా?"

"రోజూ పనికోసం పోతూనే వుండాడు. దొరకలేదమ్మా. నేను ఆ మూడో యింట్లో యెనిమిది రూపాయలకి పని చేస్తున్నాను."

"ఆ డబ్బు మీకు చాలుతుందా?"

"ఎలా చాలుతుందమ్మగారూ. పులియాంతోపులో వుండేవారం. మూడు మాసాల బాడుగ యివ్వలేదని—ఆ ఇంటి ఆసామి గిన్నె బిందా లాక్కుని పంపేశాడు. అక్కడనుంచి ఆ కుండా, డబ్బా తెచ్చుకు యిక్కడకొచ్చాము."

"ఇదివరకెప్పుడూ యిలా వీధుల్లో వుండలేదా?"

"లేదమ్మగారూ! మాసానికి నలభై రూపాయలు తెచ్చేవాడు. నేను పనిచేసి ఎనిమిది తెచ్చేదాన్ని. ఆ డబ్బుతో మాకు హాయిగా వెళ్ళిపోయేది. ఆ పని పోయింది. మా కట్టాలు ప్రారంభం అయాయి" అంది శానమ్మ.

నేను మాట్లాడలేకపోయాను. శానమ్మ అభిమానం గల మనిషిలావుంది. అడుక్కోడం, గదవాయింపులు పడటం—యిలాంటివి అలవాటులేని మనిషిలా కనపడింది. కాని కాలం—అనుకోవాలి.

ఈ రోజుల్లో బాగా చదువుకున్నవారే నిరుద్యోగ సమస్యతో సతమతం అవుతున్నారు. అలాంటిది అక్షరంముక్క—

లేక, కాయకష్టంమీాద ఆధారపడాల్సిన శానమ్మ మొగుడికి వుద్యోగం పోతే మళ్ళీ దొరకడం మాటలతో వుందా?

శానమ్మ మొగుడి వుద్యోగం ఎందువల్ల పోయిందో నే నడగలేదు. లక్ష కారణాలుంటాయి. ఆ మర్నాడు మా పనిమనిషి వచ్చింది. అంచేత శానమ్మ అవసరం నాకు లేక పోయింది. మా పనిమనిషి యీామాటా ఆమాటా చెపుతూ శానమ్మ మొగుడి వుద్యోగం యెలా పోయిందో చెప్పింది.

మద్రాసులో చాలచోట్ల పాత సీనారేకు డబ్బాల్తో, సీనారేకు ముక్కల్తో చిన్నచిన్న పాలగొట్టాలు, పడులు అర పడులు లాంటి కొలతల డబ్బాలూ చేస్తారు. కొన్ని కొన్ని షాపుల్లో బెడ్ లైటుకి బర్నర్లూ, బెడ్ లైట్లూ తయారుచేసి-అవి ఎగుమతికూడా చేస్తారుట. చిమ్నీలు బయట కొంటారు, మిగతా లైటంతా చేస్తారట ఆ షాపుల్లో. అట్లా బర్నర్లూ లైట్లు చేసే షాపుల్లో శానమ్మ భర్త నాలుగేళ్ళుగా పని చేస్తూ—సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు.

పులియాంతోపులో ఒక చిన్నగదిలో భార్యా,పిల్లాడూ అతనూ వుంటూండేవారు. సమ్మె చెయ్యడంవల్లా, ఎక్కువ జీతం కావాలని ఆందోళన చెయ్యడంవల్లా అతని వుద్యోగం పోలేదు.

ఒక చిన్న సీనారేకు ముక్క చేతులో గుచ్చుకు, కోతి పుండు బ్రహ్మరాక్షసై, నెల్లాళ్ళు ఆస్పత్రిలో వుండటంతో, ఆవుద్యోగం ఇచ్చిన ధర్మప్రభువు మరొకడిని వేసుకున్నాడతని స్థానంలో. కార్మికుల హక్కులకోసం పోరాడగల సమర్థుడా

శానమ్మ మొగుడు? అవన్నీ అతనికి తెలియవుకూడాను. తమ ఖర్మ అనుకుని వుంటుంది శానమ్మ.

o o o

మొదటి ఆట సినిమాకి వెళ్ళివస్తున్నాం. వీధి తలుపు తాళం తీస్తూంటే—ఎదుటి పేవ్‌మెంటుమీంచి ఒక ఛేమూలుగు వినపడుతోంది. తాళం తెరిచాక ఆయన లోపలికెళ్ళారు.

నేను శానమ్మ భర్తని పిలిచి ఏమిటదని అడిగాను.

శానమ్మ మూడో నెలలో వుందిట, సాయంత్రంనుంచీ కడుపునెప్పిట—ఒకటే గిలగిల తన్నుకుంటోందిట.

"ఆస్పత్రికి తీసుకెళ్ళు" అన్నాను.

"తెల్లారితేగాని చేర్చుకోరు. తెల్లారాకగూడా నడిపించుకు తీసుకెళ్ళడం యెల్లా అమ్మా?" అన్నాడు.

'రిక్షామీద తీసుకెళ్ళు'—అందామనుకుని నాలుకకరుచుకున్నాను. బస్సులో మార్చిన రూపాయిలో బస్సుటికెట్లూ, మల్లెపువ్వులూ, సాయంత్రం పత్రికా పోను—తొమ్మిదణాలు వున్నాయేమో! ఆ చిల్లరడబ్బులు అతని చేతిలో పడేశాను.

రీటా హేవర్తు పంచరంగుల్లో డాన్సులు చెయ్యడం కళ్ళపండువుగా చూశాం, ఆనందించాం. ఆయన స్నానం చేస్తున్నారు - బాత్‌రూమ్‌లోంచి చందన పరిమళం గుప్పుమంటోంది. ఇంక సుఖంగా భోంచేసి, కమ్మగా నిద్రపోతాం. పాపం! ఎదురుగ్గా ఆ శానమ్మ—శానమ్మ మొగుడూ, వాళ్ళ కుర్రాడూ - ఆఖరికి ఆ కుర్రాడైనా అన్నం తిన్నాడో లేదో! ఏమిటీ జీవితాలు? తలుపుల వెనుక మేము - నట్టనడివీధిలో వాళ్ళు.

"ఒకరిని చూసి బాధపడ్తాం, యిద్దరిని చూసి బాధపడ్తాం. లోకంలో లెక్కలేనంతమంది వున్నప్పుడు ఎలాగ? కాబట్టి వాళ్ళనిగురించి ఆలోచించకు" అంటారాయన. నిజమే—కాని నా మనసు ఎందుకింత కలవరపడాలి?

ఆ మర్నాడు సాయంత్రం శానమ్మ భర్త తనకి తాను గానే వచ్చి చెప్పాడు—కడుపు పోయిందట, నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలోనే వుండాలన్నారట. అదీ బాగానే వుంది—అక్కడైనా ఏదో తిండి దొరుకుతుంది.

తల్లి ఆస్పత్రిలో—తండ్రి ఎక్కడెక్కడో తిరికి నాలుగు తిండిగింజలు సాయంత్రంవేళకి పట్టుకొచ్చేవాడు. పాపం! శానమ్మ కొడుకు అల్లా బిక్కుబిక్కుమంటూ కుండలూ, డబ్బాలూ, చింకిచాప కాపలా కాస్తూ కూచునేవాడు పగలల్లా.

ఏదో పనివుంటేగాని నేనువీధిలోకిరాను. మధ్యాహ్నం పన్నెండున్నర అయింది. ఇంకా పోస్టుమాన్ రాలేదు. మా అక్కదగ్గిరనుంచి ఉత్తరం రావాలి. పోస్టుమాన్ వస్తున్నాడేమో చూసేందుకు వీధిగుమ్మంలోకి వచ్చాను. డొక్కలు లోతుకుపోయిన శానమ్మ కొడుకు చెయ్యిచాచాడు. ఒక అణా పడేశాను.

మరో అరగంటకి వీధిలో ఏదోగోల—అరుపులు వినిపిస్తే తలుపు తీసుకు గుమ్మంలోకి వచ్చాను. కళ్ళెదురుగావున్న యీ దారిద్ర్యం చూడటమే నాకు బాధగావుంది. పాపం! భరిస్తున్నవాళ్ళ మాటేమిటి? శానమ్మ కొడుకు వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. ఆ కుండల చుట్టూ పదిమంది పిల్లలూ, నలుగురు ఆడవాళ్లూ కూడారు.

శానమ్మ కొడుకు నన్ను చూపించి "ఆ యమ్మ యిచ్చారు అణా" అన్నాడు.

పన్నెండేళ్ళ కుర్రాడి తల్లి - అది తనకొడుకు డబ్బనీ, ఈ శానమ్మకొడుకు దొంగిలించాడనీ అంది. అది నే నిచ్చిందన్నా, వాళ్ళు వినేస్థితిలో లేరు. అలగాజనం నా మాటచొరనివ్వరు. చివరికి పక్కింటాయన కల్పించుకోగా, ఎక్కడి వాళ్ళక్కడ జారుకున్నారు.

ఆ క్షణంనుంచి పన్నెండేళ్ళ కుర్రాడు మటుకు—యీ శానమ్మ కొడుకుమీద కసిపెట్టుకు కూచున్నాడు. తండ్రి వచ్చాక పిల్లాడు జరిగిన సంగతి చెప్పాడు. అంతావిని శానమ్మ మొగుడు తనకొడుకునే నాలుగు మోదాడు.

మర్నాడు ఉదయం పదిగంటలవేళ నేను కూరలు బేరంచేస్తున్నాను. శానమ్మకొడుకు వారిఆస్తిఅయిన కుండలూ చింకిచాపకీ కాపలాకాస్తూ కూచున్నాడు. నిన్నటి పదిమంది పిల్లలూ వెళ్తూవెళ్తూ రెండురాళ్ళువిసిరారు. ఒకరాయి కుండకీ, ఒకరాయి శానమ్మ కొడుకుకీ తగిలింది. పిల్లాడి ఏడుపుతో నేను నాలుగు కేకలు వెయ్యబోయేవేళకి, పిల్లలంతా నాలుగు మూలలకీ పారిపోయారు.

నాకా పిల్లలంటే అసహ్యంవేసింది. శానమ్మావాళ్ళకి వున్న రెండు కుండల్లో ఒకటి చితికిపోయింది. శానమ్మ కొడుకుని అలా అనవసరంగా కొట్టటం ఎందుకు? అణాయిచ్చి ఈ పాపం గట్టుకున్నానా - అనిపించింది. ఆ అణావల్లనేగా యీ కష్టలు!

కొంతమంది పిల్లలకి జంతువుల్ని పెంచడం ఎంత యిష్టమో - మరికొందరికి వాటిని హింసించడంకూడా అంతే యిష్టం. కుంటికుక్క వెడ్తూంటే రాళ్ళురువ్వుతారు దానిమీద. అల్లాగే బిచ్చగాణ్ణి, జబ్బుమనిషినీ చూసి జాలిపడక హింసిస్తారు. బహుశా అలాంటి పిల్లలే పెరిగి పెద్దవారైన మీదట లోకకంటకు లవుతారేమో ననిపిస్తుంది.

తిరిగితిరిగి వచ్చాడు శానమ్మ మొగుడు సాయంత్రానికి కుండమీద రాయివిసిరిన కుర్రాడు ఆ వైపులకు రాగానే పట్టుకున్నాడు. కొట్టాలేదు, తిట్టాలేదు. కాని ఆపన్నెండేళ్ళకుర్రాడూ పెద్దపెట్టున ఏడవడం మొదలుపెట్టాడు. పీక్కుపోయిన కళ్ళతో దుబ్బుగా పెరిగిన గడ్డంతో, చింకిపాతలతో వున్న శానమ్మ మొగుడిని "నీ అంతరం యెంత? ఆ అబ్బాయిగారి అంతరమెంత? అత నా మేడయింటి వారబ్బాయి. వాళ్ళ నాన్నకి తెలిస్తే నిన్ను నిలువునా చీరేస్తాడు—అదేంపని...పిచ్చిపని" అన్నారు—పిల్లాడి ఏడుపువిని అక్కడ చేరిన నలుగురూను.

అవ్వాళ ఆదివారం; ఆయన యింట్లోవున్నారు. రెండోసారి కాఫీతాగి, పేపరు చదువుకుంటున్నారు. బయట పిల్లల కేకలు, నవ్వులూ వినిపిస్తే వీధిలోకి వెళ్ళాను. శానమ్మభర్త కొడుక్కి అన్నం పెడుతుంటే, నిన్నటి పిల్లవాడూ యింకా ఆ గుంపులోని పదిమంది పిల్లలూ నెమ్మదిగా వెనకతట్టుగా వచ్చి అతని పైమీదబట్ట లాక్కుని పరుగెత్తారు.

పెట్టేపెట్టే అన్నం అలా వదిలి—పెద్దపెద్ద కేక లేసుకుంటూ, ఆ పిల్లల వెంట యితనూ పరుగెత్తాడు. పిల్లల అరుపులు, నవ్వులు,...వెనక ఇతను తిట్టుకుంటూ పరుగెత్తాడు.

కొంతదూరం పోయాక పిల్లలు ఆ చింకిబట్టని వదిలేశారు. అది వెనక్కి తెచ్చుకుని, మళ్ళా రేకులడబ్బాల పక్క కొడుకుని పెట్టుకు కూచున్నాడు.

ఒక మనిషికి, మామూలు మనిషికి కొన్ని గంటల్లో పిచ్చెత్తించడం, నేను స్వయంగా కళ్ళారా ఆనాడు చూశాను. అది ఎన్నటికీ మర్చిపోలేను. ఒక మామూలు మనిషి అలా చూస్తూండగానే పిచ్చివాడయ్యాడు.

శానమ్మ భర్తకి నిజంగా మతి పోగొట్టారు పదిమంది పిల్లలూ, పెద్దలూ కలిసి. ఎలాగ?– అని అడక్కండి. వెనక పాటుగా వెళ్ళి పైబట్ట లాగడం, రాళ్ళు విసరడం, దూరంగా నిల్చుని వెక్కిరించడం, యిలా సరిగ్గా ఒక గంటసేపు గోల చేశారు.

నేను భరించలేక లోపలికొచ్చి–ఆ పిల్లల్ని కేకలెయ్యమని మా వారితో చెప్పాను. ఆయన నవ్వి, "నీకు అసలు లోకం గురించి తెలియదు. డబ్బు లేకపోయాక మనిషికి పిచ్చెత్తక మరేం జేస్తుంది? దరిద్రం పిచ్చికి నాంది. ఆ పిల్లల్ని మందలించేందుకు మనమెవరం? మన మాట వింటారా? అదిచూసి బాధపడే బదులు చూడకుండా వుండటం మంచిది" అన్నారు వారు. ఆడదాన్ని నేనేమి చెయ్యగలను?—వూరుకున్నాను.

ఆ సాయంత్రం మేము బీచికెళ్ళి — చీకటి పడ్డాక యింటికొచ్చాం. మేమింటికొచ్చే వేళకి పేవ్‌మెంటు మీద చాపా లేదు, డబ్బాల్లేవు. చిందరవందరగా పడ్డ రాళ్ళుమటుకు కనిపించాయి.

మూడురోజులు పోయాక ఒక మధ్యాహ్నం శానమ్మ మా వీధితలుపు తట్టింది. మనిషి చాలా చిక్కిపోయింది.

"నేను పక్కనుంటే–ఆ మనిషి అలా పిచ్చివాడయ్యే వాడు కాదు. ఈళ్ళంతా జేరి నా మనిషికి పిచ్చెక్కించారు." అంది శానమ్మ.

"పిచ్చేమిటి?"

ఆ మనిషికి పిచ్చిలేదంటే, ఆస్పత్రిలో వాళ్ళు నమ్మ తేనా? యింతకీ మారోజులు బాగోలేవు. యింకో మూడు మాసాలకిగాని వదలరట. అప్పటికైనాజబ్బు కుదిరితేనే వదుల్తారు. లేకపోతే అక్కడే వుంచేస్తారట" అంది శానమ్మ కళ్ళమ్మట నీళ్ళతో.

"పాపం!" అన్నాను.

"బయటికొస్తే రాళ్లురువ్వుతారు. నాకిక్కడేబావుంది అన్నాడు" అంది శానమ్మ.

ఇంతలో శానమ్మ కొడుకు ఎదురింటి వారింట్లోనుంచి బయటికివచ్చాడు. వాళ్లునాలుగు మెతుకులుపెట్టారుకాబోలు మూతి తుడుచుకుంటూ వచ్చి తల్లి వెనక, నక్కి నుల్చున్నాడు.

నాకు మాటలు తోచలేదు.

"వాడు యేడుస్తూ ఆస్పత్రికి వచ్చి చెప్పేదాకా, పోలీసులు వాళ్ళ బాబుని పట్టుకు పోయారని నాకు తెలవదు సంజేళ బయలుదేరి మా చిన్నాన్న యింటికి వెడతాను.

పూట సగందూరం నడుస్తే, తెల్లారిగట్ల మిగతా సగం నడ వచ్చు" అంది శానమ్మ.

"ఏవూరు? తిరువళ్లూరేనా? ఎలా వెడతావ్?"

"నడిచి"

"డబ్బులిస్తాను రైలుమీద వెళ్ళు" అన్నాను.

"డబ్బు వద్దండీ అమ్మగారు. ఆ యింటిన్నుంచి వచ్చాక నాకు మారు చీరెలేదు. పాతచింకి వుంటే అది మార్చి రాత్రిళ్లు వుతికి, వేసుకునేదాన్ని. కుండల్తోపాటు ఆ పీలిక గూడా పోయింది. ఓ పాతచీర యిప్పిస్తారా...." అందిశానమ్మ దీనంగా.

పాతచీరె ఒకటి తెచ్చిచ్చాను.

డబ్బులివ్వబోగా ససేమిరా పుచ్చుకోనంది.

"ఎదురింటి మారాజు అర్థరూపా యిచ్చారు. మీరు కోక యిచ్చారు. అదే పదివేలు" అనిదణ్ణంపెట్టింది; శానమ్మ-కట్టుబట్టకూడా కరువైన ఆడది శానమ్మ—వెళ్ళిపోయింది.

——:o:——